# ఎందుల కాడిన నాటకమయ్యా

వత్సలా గబ్బూర్

ఎందుల కాడిన నాటకమయ్యా
ఇందు వేంచేసిన రఘురామయ్యా

దశరథ సుతుడైన ధరనేలుటకో
దశకంఠుదునిమి ధరణి బ్రోచుటకో

మునివెంటచనినది యాగము కావనో
మునిసతికిల స్త్రీరూపము నొసగనో
చనినది మిథిలకు వేడుక చూడనో
జనకుని తనయను పరిణయ మాడనో

వెడలితి కానలకు సీత సౌమిత్రితో
తండ్రి యానతిని పాలించుటకో
జంటగ సతితో వనముల తిరుగను
దొరకెను ఇదె మంచి సమయమనో

రావణుచెల్లి నుపేక్షించితివి
నీ ఏకపత్నీత్వము నిరూపించుటకో
రావణునితో కయ్యమాడుటకు
నాందీవాక్యము పలుకుటకో
(కథ మొదలాయెనని తెలుపుటకో)

వానరులచే వారధి కట్టించితివి
నీ నేర్పరితనము చూపుటకో
నీ నామస్మరణముచే వానరుడైనను
సంసారజలధిని దాటగలడనో

పగవాని తమ్ముని కాశ్రయమిచ్చితి
నీ దాతృత్వము చూపుటకో
భక్తులందరు నీవారేనని
భక్తవత్సలుడవని తెల్పుటకో